నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: మరమ్మతుల కారణంగా కాటేదాన్, గగన్‌పహాడ్ సబ్‌స్టేషన్లలోని పలు ఫీడర్లలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రవిఫుడ్ ఇండస్ట్రీయల్ ఏరియా, రామ్‌చరణ్ ఆయిల్ మిల్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు. అలాగే గగన్ పహాడ్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 వరకు గగన్‌పహాడ్ విలేజ్ ,శాతాంరాయ్ ఇండస్ట్రీయల్ ఏరియా. కాటేదాన్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పుష్టి ఫుడ్, చింటుఫుడ్, సాగర్ గుట్కా, చావ్లాఫుడ్, భగవతి దాల్ మిల్, ఏఎంసీ ప్లాస్టిక్. కాటేదాన్ ఇండస్ట్రీయల్ ఏరియాలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిటిజన్ కాంట, వికాస్ ఫుడ్, డ్యూక్స్ ,వీఎంఎల్, కాటేదాన్ ఇండస్ట్రీయల్ ఏరియాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించి సహకరించాలని వారు కోరారు.

నేటి నుంచి మున్సిపాలిటీల్లో సర్వే కౌంటర్లు

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో వివరాలు ఇవ్వని వారు మున్సిపాలిటీల్లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని మణికొండ, నార్సింగి మున్సిపల్ కమిషనర్లు డి. ప్రదీప్‌కుమార్, టి.కృష్ణమోహన్‌రెడ్డి శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 16 నుంచి ఈనెల 28 వరకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని ప్రజాప్రతినిధులు, కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు ప్రజలకు తెలియజేసి సర్వేలో వివరాలు నమోదు చేసుకునేలా చూడాలని కోరారు.

రేపు సేవాలాల్ జయంతి



ప్రొఫెసర్ రమేశ్ నాయక్

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈనెల 17న సంత్ సేవాలాల్ మహారాజ్ 286 జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ మాలోత్ రమేశ్ నాయక్ తెలిపారు. విశ్వవిద్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈ వేడుకలకు ఆల్ ఇండియా బంజారా సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యుడు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ విశ్వ విద్యాలయాల విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అమరవీరులకు ఘన నివాళి


రాయదుర్గం: పుల్వామా అమరులకు హెచ్‌సీయూ క్యాంపస్‌లోని కార్గిల్‌చౌక్‌లో నివాళులర్పించారు. శుక్రవారం రాత్రి అఖిలభారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో అమరులైన సైనికుల చిత్రపటాలకు పూలమాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు.

పీఎస్‌లను సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు

గచ్చిబౌలి: శివరాంపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ)లో శిక్షణ తీసుకుంటున్న ట్రైనీ ఐపీఎస్‌లు శనివారం పలు పోలీస్‌స్టేషన్లను సందర్శించారు. గచ్చిబౌలి, రాయదుర్గం, మాదాపూర్ పోలీస్‌స్టేషన్ల పనితీరును పరిశీలించారు. రిసెప్షన్, జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ నమోదు, లాకప్, రికార్డుల గురించి ఎస్‌హెచ్‌ఓలు యువ ఐపీఎస్‌లకు వివరించారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు పెట్రోల్ మొబైల్స్, బ్లూకోల్ట్స్, సెక్టార్ ఎస్ఐలు ఎలా స్పందిస్తారో అడిగి తెలుసుకున్నారు. సైబరాబాద్‌లోని 18 పోలీస్ స్టేషన్లను ట్రైనీ ఐపీఎస్‌లు సందర్శించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

అభివృద్ధికి తోడ్పాటునందిస్తాం

ఎస్కీ డైరెక్టర్ డా.రామేశ్వరరావు



రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ద్వారా భవిష్యత్తులో శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని ఎస్కీలో 'టెక్నాలజీ రిస్క్ మేనేజ్‌మెంట్'పై జాతీయ శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్కీలో ప్రతియేటా సుమారు 350 వరకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. వృత్తి నైపుణ్యాలు మెరుగుపర్చుకోవడానికి శిక్షణ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, నిపుణులు, ఎస్కీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లకు మోక్షం!

రాజేంద్రనగర్ సర్కిల్‌లో అధికారుల కొరడా

- 2 నెలల్లో 600కు పైగా ఆక్రమణల తొలగింపు
- మళ్లీ వ్యాపారాలు నిర్వహించవద్దని హెచ్చరిక



జేసీబీతో ఫుత్‌పాత్‌పై ఏర్పాటు చేసిన రేకుల షెడ్లు తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై జీహెచ్‌ఎంసీ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ఇన్నాళ్లు ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న కొందరు ఇంటి యజమానులు అద్దె వస్తుందనే ఆశతో తమ గృహాల ఎదుట డబ్బాలు, రేకుల షెడ్లు ఏర్పాటు చేసి చిరు వ్యాపారులకు అంటగట్టారు. అయితే వారిని అడిగేవారు లేక ఏళ్లుగా దర్జాగా వ్యాపారం చేసుకున్నారు. ఓవైపు వాహనాల సంఖ్య పెరగడం.. మరోవైపు రోడ్ల ఆక్రమణతో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రం కావడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ అధికారులు రంగంలోకి దిగారు. రాజకీయ ఒత్తిళ్లు వస్తున్నప్పటికీ ఎవరీ మాట వినకుండా తమ పని తాము చేసుకుంటున్నారు. సర్కిల్ పరిధిలోని రాజేంద్రనగర్ ,అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లలో రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీసులు, పోలీసుల సమన్వయంతో సుమారు 600 వరకు ఫుత్‌పాత్‌లపై అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బాలు, షెడ్లను కూల్చివేయించారు.

తాజాగా మరో 60 ఆక్రమణల తొలగింపు..

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఓల్డ్ కర్నూల్ ప్రధాన రహదారిపై శనివారం ఫుత్‌పాత్‌పై అక్రమ కట్టడాలను టౌన్ ప్లానింగ్ అధికారులు నేల మట్టం చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సుమారు 60 అక్రమ రేకుల షెడ్డులు, డబ్బాలు తొలగించారు. రెండు రోజుల క్రితం ఫుత్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయాలు తీసివేయాలని సూచించినా ఎవరూ వినకపోవడంతో శనివారం పోలీసు బందోబస్తు మధ్య జేసీబీతో పూర్తిగా కూల్చివేయించారు.



ఓల్డ్ కర్నూల్ రోడ్డుపై ఆక్రమణలు కూల్చివేయిస్తున్న అధికారులు

అక్రమ నిర్మాణాల కూల్చివేత సరైనదే..



కాటేదాన్ ప్రధాన రహదారిపై నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారం సుకుంటున్న వారి షెడ్లను కూల్చడం మంచి నిర్ణయమే. అలాగే అంతర్గత రోడ్లపై కూడా అక్రమంగా డబ్బాలు ఏర్పాటు చేసిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలి.

-అడికె రాజు, స్థానిక బీజేపీ నాయకుడు

రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేయొద్దు..



వ్యాపారస్తులు తమ పరిధిలోనే వ్యాపారం చేసుకోవాలి. రోడ్డును ఆక్రమించి షెడ్డు గాని డబ్బాలను గాని వేసుకుంటే వారిపై చర్యలు తప్పవు.ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు జీహెచ్‌ఎంసీకి సహకరించాలని కోరుతున్నాను.లేనిచో కూల్చివేతలు తప్పవు.రోడ్డుపై ఉన్న స్తంబాలు తొలగించడానికి విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి కరెంటు పోల్స్‌ను తొలగిస్తాం.ప్రధాన రహదారిపై ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా వ్యాపారం చేసుకోవాలని వ్యాపారులను కోరుతున్నా.

-శ్రీధర్, రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

మణికొండ: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత ఉంటుందని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గండిపేట మైసమ్మ ఆలయ ఆవరణలో పునఃనిర్మించిన శ్రీముక్తేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక మాజీ కౌన్సిలర్ విజేత ప్రశాంత్‌యాదవ్ శివాలయాన్ని పునః నిర్మించడం అభినందనీయమన్నారు. ఈనెల 13న ప్రారంభమైన ప్రతిష్ఠాపన పూజలు శనివారంతో ముగిశాయి. కార్యక్రమంలో సినీ సంగీత దర్శకుడు కోటి దంపతులు, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.ఆయన వెంట రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, నాయకులు పాపిరెడ్డి, శ్రీనివాస్, గడ్డం శేఖర్ యాదవ్, దుర్గేశ్‌యాదవ్, ప్రశాంత్‌యాదవ్ తదితరులు ఉన్నారు.



స్వామివారిని దర్శించుకున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



కార్తీక్‌రెడ్డి, నాయకులు..

రేపటి నుంచి సామాజిక తనిఖీ

శంషాబాద్ రూరల్: మండలపరిధిలో వివిధ గ్రామాల్లో చేసిన జాతీయ ఉపాధి హామీ పనులపై గ్రామాల వారీగా ఈనెల 17 నుంచి 21 వరకు సామాజిక తనిఖీలు నిర్వహించనున్నారు. ఈ నివేదికలపై 22న మండల పరిషత్ ఆవరణలో ప్రజావేదికను నిర్వహిస్తామని ఎంపీడీఓ మున్నీ తెలిపారు. ఏప్రిల్ 1 2023 నుంచి మార్చి 31, 2024 వరకు మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ఉంటాయని పేర్కొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం



పూజల్లో ఆలయ వ్యవస్థాపకుడు సామ భూపాల్‌రెడ్డి

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ 12 వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు సామ భూపాల్‌రెడ్డి ఆలయ సభ్యులు ఉదయం వేద పండితులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉప్పర్‌పల్లి గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఉత్సవ విగ్రహాల ఊరేగించారు. కార్యక్రమంలో శ్రీవీరాంజనేయ భక్త సమాజం ఉప్పరిపల్లి, ప్రణవ భక్త సమాజం హైదర్‌గూడవారు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి ఎమ్మెల్యేకు వారి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి ఇప్పటి వరకు తన దృష్టికి తెచ్చిన సమస్యలన్నిటినీ పరిష్కరించానన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు చేసుకున్న దరఖాస్తులకు ఇంకా మంజూరీ రాకపోవడం తనకు వచ్చే ఫిర్యాదులు ఎక్కువగా ఉంటాయన్నారు. వాటన్నిటిని తాను అధికారుల దృష్టికి తెచ్చి దరఖాస్తుల్లో సాంకేతిక సమస్యలు తొలగించి లబ్ధిదారులకు దరఖాస్తులు మంజూరు అయ్యేలా చూస్తున్నానన్నారు.

'నిషేధిత వస్తువులు అమ్మితే కఠిన చర్యలు'

గోల్కొండ: కిరాణా షాపులు, పాన్ డబ్బాలలో నిషేధిత గుట్కాలు, పాన్ మసాలలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ..గుట్కాలు, ఇతర మత్తు పదార్థాలు సమాజాన్ని ముఖ్యంగా యువతను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. వివిధ రకాల మత్తు పదార్థాలను విక్రేతలు మారు పేర్లతో రకరకాల ప్యాకింగ్‌లలో అనుమానం లేకుండా విక్రయిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మత్తు పదార్థాలు లేని నగరంగా మార్చడమే తమ లక్ష్యమని, ఈ దిశగా మత్తు పదార్థాలు, గుట్కాలు అమ్మే వారిపై దాడులు చేస్తున్నామన్నారు. ఈ విషయంపై స్థానికులు పోలీసులకు సహకరించాలని గుట్కాలు, ఇతర మత్తు పదార్థాలు అమ్మే వారి వివరాలు తమకు తెలపాలని ఆయన కోరారు.

ఏటీఎం కేంద్రంలో చోరీకి యత్నం

గౌలిపురా: ఏటీఎం కేంద్రంలో ఓ వ్యక్తి చోరీకి యత్నించి విఫలమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం..శాలిబండ రాజేశ్ మెడికల్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో శనివారం తెల్లవారు జామున 3.50 గంటలకు ఓ గుర్తు తెలియని వ్యక్తి లోనికి ప్రవేశించి మెషీన్‌ను ధ్వంసం చేసి డబ్బులను దొంగలించేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. ఈ విషయాన్ని గమనించిన సర్వీసు మేనేజర్ ఎస్‌బీఐ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ సయ్యద్ మహమ్మద్ రఫీకి సమాచారం అందజేశాడు. బ్రాంచ్ మేనేజర్ మొఘల్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు స్థానికంగా సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కాగా ఏటీఎం కేంద్రంలో రూ.7,70,100ల నగదు ఉన్నట్లు బ్యాంక్ అధికారులు గుర్తించి ఎలాంటి నగదును దొంగతనం జరగలేదన్నారు.

యువత ఆలోచన సరళిలో మార్పురావాలి



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ కరీం

ఏజీవర్సిటీ: పోటీ ప్రపంచంలో యువత ఆలోచన సరళిలో మార్పు అవసరమని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ఎం.ఎ కరీం అన్నారు. రాజేంద్రనగర్‌లోని తెలంగాణ కో ఆపరేటివ్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్‌లో యువజన, క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యువత మనోవికాసానికి దోహదపడేలా శనివారం నిర్వహించిన మానసిక అవగాహన సదస్సులో ఆయన పాల్గొని కెరీర్ ప్లానింగ్ గోల్ సెట్టింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆధునిక జీవనశైలికి అలవాటు పడిన యువత నియంత్రణ కోల్పోయి మానసిక రుగ్మతకు గురవుతున్నారన్నారు. యువత ఇతరుల మీద ఆధారపడకుండా సొంతంగా జీవించేందుకు ప్రాథమిక నైపుణ్యాలు ఎలా పెంపొందించుకోవాలో ప్రయోగాత్మక ప్రదర్శన రూపంలో బోధించారు. మానసిక ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 9440488571 నంబర్‌కు కాల్ చేస్తే మానసిక నిపుణులు సలహాలు, సూచనలు చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా యువజన అధికారి ఖుష్బూ గుప్తా, ప్రోగ్రాం అధికారి యాదగిరి యువజన సర్వీసులు శాఖ అధికారులు, సిబ్బందితో పాటు యువకులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేసుకోవాలి



ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

మణికొండ: ఉరుకుల, పరుగుల జీవితంలో ప్రతిఒక్కరూ తరచుగా వైద్య పరీక్షలు చేసుకుని డాక్టర్ల సలహాలు పాటించి ఆరోగ్యంగా జీవించాలని మహాత్మా గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు రొమ్ము కేన్సర్‌పై పరీక్షలు, అవగాహన కార్యక్రమాన్ని రెనోవా ఆసుపత్రి సహకారంతో శనివారం నిర్వహించారు. ఆయన ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని, దాన్ని కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రొమ్ము కేన్సర్ క్లినికల్ రీసెర్చ్ స్పెషలిస్ట్ ప్రియాంక వర్మ, డాక్టర్ రాజశేఖర్, టెక్నీషియన్లు కావేరి, బిందు, ఈశ్వర్‌గౌడ్, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ జి.బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



అభ్యుదయనగర్ కాలనీలో పర్యటిస్తున్న ఎస్ఈ తదితరులు

బండ్లగూడ: విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎస్ఈ డి. శ్రీరామ్మోహన్ సూచించారు. అభ్యుదయనగర్ కాలనీలో డీఈ జి.సత్యనారాయణతో కలిసి శనివారం పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ ఎత్తులో ఉన్న వైర్లు సరి చేయాలని, అలాగే త్రీఫేజ్ లైన్ల పొడిగింపు, రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను పక్కకు తొలగించే పనులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, సిబ్బంది నరేందర్ బాబు, విజయ్, శామ్యూల్, ఆనంద్, రమణ,ధన్‌రాజ్, అశోక్, జాకబ్, బాబన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం



గోపన్‌పల్లితండాలో పర్యటిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, జలమండలి మేనేజర్ అభిషేక్‌రెడ్డి

రాయదుర్గం: గోపన్‌పల్లి తండాలో సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపడుతున్నామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. శనివారం గోపన్‌పల్లి తండాలో జలమండలి అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా నేపథ్యంలో అన్ని కాలనీలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. పాత పైప్‌లైన్‌లను ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో జలమండలి మేనేజర్ అభిషేక్‌రెడ్డి, నాయకులు హన్మంతునాయక్, శ్రీరామ్‌నాయక్, రాజునాయక్, రాణి, నర్సింగ్,ప్రకాశ్, నర్సింహ, సుమన్, రాజు, మోహన్‌రెడ్డి, శ్యామ్ రాథోడ్, శ్రీశైలం, కృష్ణ, నరేందర్, స్థానికులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్లు

యాకుత్‌పురా: సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సూచించారు. యాకుత్‌పురాలోని సయీద్ విల్లా ఫంక్షన్ హాల్ నిర్వహించిన కార్యక్రమంలో శనివారం ఆయన చార్మినార్ మండల పరిధిలో మంజురైన 291 షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గం పరిధిలోని చార్మినార్, బండ్లగూడ, సైదబాద్ మండల పరిధిలోని లబ్ధిదారులకు షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకలను అందజేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బజార్, పత్థార్‌గట్టి, డబీర్‌పురా డివిజన్ల కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, అలందర్ వాలాజహి, చార్మినార్ తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి



సేవాలాల్‌కు నివాళులర్పించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



బుద్వేల్ శ్రీకృష్ణ కాలనీలో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

బండ్లగూడ: బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్, కిస్మత్‌పూర్ ఎర్రకుంట తండాలో సేవాలాల్ 286వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ హాజరై సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలకు స్ఫూర్తి ప్రదాత సంతు సేవాలాల్ మహారాజ్ అని ఆయన అడుగుజాడల్లో వారు పయనించాలని సూచించారు. కార్యక్రమంలో బంజారా అసోసియేషన్ నాయకులు, బంజారాలు పాల్గొన్నారు.

బాబుల్‌రెడ్డినగర్‌లో..

మైలార్‌దేవ్‌పల్లి: సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను బాబుల్‌రెడ్డినగర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో గోపాల్ నాయక్, సంతుగౌడ్, కిషన్ నాయక్, భాస్కర్ నాయక్, లక్ష్మణ్ నాయక్, క్రాంతి కుమార్, సోమ్లానాయక్, శ్రీనివాస్ గుప్తా, ఈశ్వర్, రాఘవేందర్ యాదవ్, అరుణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



జయంతిలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

బుద్వేల్ శ్రీకృష్ణ కాలనీలో..

రాజేంద్రనగర్: బుద్వేల్ శ్రీకృష్ణ కాలనీలో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గిరిజన ఉద్యోగులు, వ్యాపారులు, యువత సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విశ్లావత్ శ్రీహరి నాయక్ గిరిజన సంఘాల పెద్దలు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9989616273
9010221230